క్లుప్తంగా

12 మూగజీవాల అపహరణ

వేలేరు : 12 మేకలు, గొర్రెలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని బాధితుడు బొజ్జ రాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై అజ్మీర సురేశ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికుదుర్ల గ్రామానికి చెందిన బొజ్జ రాజు తనకున్న 150 గొర్రెలు, మేకలను రోజు మాదిరిగానే మేతకు తీసుకెళ్లి సాయంత్రం వ్యవసాయ బావి వద్ద గల పాకలో కట్టేసి ఇంటికి వెళ్లినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం చూడగా అందులో నుంచి 12 మేకలు, గొర్రెలు, పోట్టేళ్లు కనిపించలేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

పరామర్శ

శాయంపేట : గంగిరేణిగూడెం మాజీ సర్పంచ్ పరమేశ్వర్ తండ్రి శంకరయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆదివారం శంకరయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పత్తిపాక గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను, మందారిపేటలో మరో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఆకతాయిపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఓ మహిళ స్నానం చేస్తుండగా మొబైల్ ఫోన్‌లో వీడియో తీసిన ఆకతాయిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ స్నానం చేస్తుండగా అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. అది గమనించిన సదరు మహిళ.. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఆకతాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్ల రమేష్ ఆదివారం తెలిపారు.

కులపెద్దలపై అసభ్యకర పోస్టింగ్

హసన్‌పర్తి: కులపెద్దలపై వాట్సాప్‌లో అసభ్యకర పోస్టింగ్ పెడుతూ మానసిక వేదనకు గురిచేస్తున్న నిందితుడు తాళ్లపల్లి వెంకటేశ్వర్లును కఠినంగా శిక్షించాలని జయగిరి గౌడ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కుల సంఘం సభ్యులు మూకుమ్మడిగా పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. గౌడ సంఘం ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

సీనియర్ న్యాయవాది జాఫర్‌అహ్మద్ మృతి


జాఫర్ అహ్మద్ (ఫైల్)

వరంగల్ లీగల్: కాజీపేటలోని వెంకటాద్రినగర్‌కు చెందిన జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది సయ్యద్ జాఫర్ అహ్మద్ (69) మృతిచెందారు. ఇటీవల ఆయన కుటుంబ సమేతంగా సౌదీలోని మక్కా మసీదు దర్శనానికి వెళ్లారు. అక్కడ దర్గాను దర్శించుకుంటుండగా ఆయన ఆకస్మికంగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు అతడిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. రెండు రోజులపాటు చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన సివిల్ కేసులు వాదించడంలో దిట్ట. మృతుడికి భార్య ఇంతియాజ్, కుమార్తె ఆఫ్సియా ఉన్నారు. అహ్మద్ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే దొంతికి పరామర్శ


నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

నర్సంపేట: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆదివారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. ఎమ్మెల్యే మాతృమూర్తి దొంతి కాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. హనుమకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే దొంతితోపాటు ఆయన సోదరులు రాంరెడ్డి, భగవాన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిని పరామర్శించారు. అలాగే, మంత్రి సీతక్క శనివారం అర్ధరాత్రి నివాళులర్పించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీలు బలరాంనాయక్, కడియం కావ్య, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్‌నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణవరదరాజేశ్వర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, డాక్టర్లు ఉప్పునూతుల సంపత్, వజ్జ సాగర్ తదితరులు పరామర్శించారు.

ప్రమాదకరంగా జంక్షన్లు

- ప్రణాళిక లేకుండా నిర్మాణాలు
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని పాలకులు, అధికారులు


ప్రమాదకరంగా మారిన పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్

పరకాల : అప్పటి పాలకుల హడావుడినో.. అధికారుల తప్పిదమో తెలియదు కానీ నేటికీ జంక్షన్ నిర్మాణాలు ప్రజలకు ప్రమాదకరంగానే ఉన్నాయి. పరకాల పట్టణాభివృద్ధి, సుందరీకరణలో భాగంగా నాలుగు చోట్ల జంక్షన్ల నిర్మాణం చేపట్టాలని 2021 సంవత్సరంలో ప్రతిపాదనలు చేసి 2022లో అంబేద్కర్ జంక్షన్‌ను పునఃనిర్మాణం చేశారు. ఆర్టీసీ డిపో సమీపంలో మరో జంక్షన్ (కొండా లక్ష్మణ్ బాపూజీ)ను నిర్మాణం చేశారు. అయితే జంక్షన్ నిర్మాణానికి కావాల్సినంత రోడ్డు వెడల్పు చేయకపోవడంతో పాటు ఏలాంటి ప్రణాళిక చేపట్టకుండా ఇష్టానుసారంగా నిర్మించడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు ఆందోళనచెందుతున్నారు. ఇరుకు రోడ్డు అవడంతో వాహనాలు ఏటు నుంచి వెళ్లాలో తెలియని పరిస్థితి ఉందని వాపోతున్నారు. అంబేద్కర్ జంక్షన్‌ను వెడల్పుగా నిర్మించడంతో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులకు మలుపు తిప్పుకోవడం ఓ సవాలుగా మారింది. అయితే అదే సమయంలో హుజూరాబాద్ రోడ్డు నుంచి వస్తున్న వాహనాలకు మొగుళ్లపల్లి వైపునకు వెళ్లే వాహనాలు జంక్షన్ కనిపించకపోవడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు వాహనదారులు అభిప్రాయపడుతున్నారు.

బారికేడ్లు తీసేశారు

కొండా లక్ష్మణ్‌బాపూజీ జంక్షన్ వద్ద తరుచూ జరుగుతున్న ప్రమాదాలను నియంత్రించేందుకు పరకాల పోలీసులు పరకాల నుంచి వెళ్లే వాహనాలు కేవలం యూటర్న్ తీసుకోవడంతో పాటు జంక్షన్ అవతలి నుంచి మలుపు తిప్పుకునేలా బారికేడ్లు ఏర్పాటు చేశారు. బారికేడ్లతో ప్రమదాలు తగ్గుముఖం అయినప్పటికీ కొంతకాలం తర్వాత వాటిని తొలగించారు. దీంతో మళ్లీ ప్రమాదాలు మొదలయ్యాయని వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు వెడల్పు చేయాలి

వ్యాపారస్తుల ప్రయోజనాల కోసం రోడ్డును 120 ఫీట్ల వెడల్పు చేయకుండా 80 ఫీట్ల వరకు పరిమితం చేశారు. దీంతో జంక్షన్ల నిర్మాణం వాహనాదారులకు శాపంగా మారింది. పరకాల బస్టాండ్ వద్ద జంక్షన్ నిర్మాణం చేస్తామని చెప్పిన పాలకులు నేటికీ చేయలేదు.

– బొచ్చు చిన్నికృష్ణ, అంబేద్కర్ యువ జన సంఘం అధ్యక్షుడు

దేశ రక్షణలో ముందుండాలి


ఆత్మకూరు : పథసంచలన్ చేస్తున్న స్వయం సేవకులు


పరకాలలో..

ఆత్మకూరు : దేశ రక్షణలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ముందుండాలని కుటుంబప్రబోధన్ విభాగ్ సంయోజక్ లక్ష్మణసుధాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పురవీధుల్లో ఆదివారం ఆత్మకూరు ఖండ(ఆత్మకూరు, దామెర, శాయంపేట మండలాలు) స్వయంసేవకులు పథసంచలన్ చేశారు. మహిళలు స్వయంసేవక్‌లపై పూలు జల్లుతూ మంగళహారతులతో స్వాగతం పలికారు. పథసంచలన్ అనంతరం లక్ష్మణసుధాకర్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ స్థాపన జరిగి నూరేళ్లు పూర్తయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాలు జరుపుకొంటున్నామని అన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పథసంచలన్(రూట్‌మార్చ్) నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతిఒక్కరూ సంఘం చెప్పిన విధంగా సామాజిక సమరసతను పాటించాలని, పౌర విధులను బాధ్యతగా అనుసరించాలన్నారు. భారతీయ కుటుంబ విలువలు గొప్పవని, ప్రపంచానికే ఆదర్శమని అన్నారు. కుటుంబ విలువలను కాపాడుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి చోట మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఆత్మకూరు ఖండ కార్యవాహ విజయ్‌కుమార్, జిల్లా సహకార్యవాహ శంకర్, చంద్రమౌళి, అంశాల్, శ్రావణ్, రాజేశ్, ప్రదీప్, పైడి, రాజు, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, శివప్రసాద్, కపిల్, సాయిసేన్, సురేష్ పాల్గొన్నారు.

పరకాల : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీసరస్వతీ శిశుమందిర్ నుంచి ప్రారంభమైన రూట్‌మార్చ్ పట్టణ ప్రధాన రహదారులు, వీధుల గుండా దేశ భక్తి పాటలతో కొనసాగింది. పట్టణ ప్రజలు మంగళహారతులు పట్టారు. సర్వేశం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఆహ్వానం


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

పరకాల : నవంబర్ 3న కార్తీక మాసోత్సవం సందర్భంగా శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించనున్న మహారుద్రయాగ మహోత్సవానికి రావాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు మహారుద్రయాగ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. మహారుద్రయాగాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని, అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా ఆహ్వానిస్తానని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆహ్వానపత్రం అందించినవారిలో దేవస్థానం కమిటీ సభ్యులు లక్ష్మణ్, రవి, రవితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రాకేశ్ మృతి విప్లవోద్యమానికి తీరనిలోటు


నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు : సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్(ప్రజాపంథా) వరంగల్ డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేశ్ మృతి విప్లవోద్యమానికి తీరని లోటని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిన్న చంద్రన్న, గద్దం సదానందం, ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొత్తపెల్లి రవి అన్నారు. గూడెప్పాడ్‌లో రాకేశ్ మృతిపై ఆదివారం నివాళులర్పించి మాట్లాడారు. రాకేశ్ విద్యార్థి దశ నుంచి విప్లవోద్యమంలో భాగస్వామ్యం అయ్యారని అన్నారు. సీపీఐ ఎంఎల్ వరంగల్ డివిజన్ సహాయ కార్యదర్శి అశోక్, నాయకులు సూరి, పృథ్వీ, నర్సింహారావు, రాజు, నరేశ్, పాణి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


వేలేరు : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు



ఆత్మకూరు : బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

వేలేరు : మండలంలోని పీచర గ్రామానికి చెందిన తాటిపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మల్కాపూర్ 1984–85 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు, స్నేహితులు బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఈ మేరకు రూ.42 వేలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక చేయూత

ఆత్మకూరు : తమతో చదువుకున్న పూర్వ విద్యార్థుల కుటుంబాలకు తోటి మిత్రులు చేయూతనందించారు. ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్‌లో 2005–2006 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం బాధిత మిత్రుల కుటుంబాలను పరామర్శించారు. గూడెప్పాడ్‌లో లావణ్య కుటుంబానికి రూ.10వేలు, బలబద్ర రాకేశ్ కుటుంబానికి రూ.5వేలు, పసరుగొండకు చెందిన శ్రీశైలం కుటుంబానికి రూ.5వేలు, ఆత్మకూరుకు చెందిన చిమ్మని స్వాతి కుటుంబానికి రూ.5వేలు, ఆత్మకూరులో అనారోగ్యంతో బాధపడుతున్న సురేశ్‌కు రూ.5వేలు ఆర్థికసాయం అందించి బాల్యమిత్రుల కుటుంబాలకు చేయూత అందించారు. పూర్వ విద్యార్థులు వరుణ్‌గౌడ్, దేవేందర్, వినయ్‌కుమార్, జ్ఞానేశ్వర్, రామరాజు, అనిత, లావణ్య, రమేశ్, సురేష్, ఫయాజ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి వెంకటస్వామికి నివాళి



మామునూరు: మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ పరిపాలన భవనంలో మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు హాజరై వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ వీరన్న, ఇన్‌స్పెక్టర్లు విజయ్, రవి, రాజ్‌కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో వైరల్

శాయంపేట : బీఆర్ఎస్ హయాంలో మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని వల్పుదాసు వెంకటరమణ(రాము) అనే పేరుతో వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చక్కర్లు కొడుతుంది. ఆ పోస్టులో 'భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హయాంలో మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనుల్లో దాదాపు 50 ఇళ్లు తొలగించారు. బాధితులకు 15 రోజుల్లోనే డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని, ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బాకీ ఉందని చెబుతూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రజలకు కాంగ్రెస్ బాకీ కార్డులను పంపిణీ చేస్తున్నారు. మీరు కూడా మీ హయాంలో బాకీ ఉన్న డబుల్ బెడ్రూంలను నిర్మించి పంపిణీ చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి' అని ఉంది. దీంతో ఆ పోస్టు వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యింది.

డిప్యూటీ కలెక్టర్‌కు సన్మానం



పరకాల : పట్టణానికి చెందిన (ప్రస్తుతం కరీంనగర్) రిటైర్డ్ పోలీసు అధికారి పాలకుర్తి కాశయ్య కుమారుడు సందీప్ నిజామాబాద్ డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి సందీప్‌ను సన్మానించి అభినందించారు. బాబాయి కాశయ్య స్ఫూర్తితో సందీప్ వ్యవసాయశాఖ అధికారిగా పనిచేస్తునే గ్రూప్–1 ద్వారా డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సాధించడం అభినందనీయని తెలిపారు.

ఎంపీడీఓ సుధీర్‌కు..



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొక్క సుధీర్ ఇటీవల విడుదలైన గ్రూప్–1లో 437.50 మార్కులు సాధించి 993 ర్యాంక్‌తో ఎంపీడీఓగా ఉద్యోగం పొంది సీఎం చేతుల మీదుగా ఆర్డర్ కాపీ అందుకున్నారు. ఈ మేరకు సుధీర్‌ను ఆదివారం అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ శాలువాతో సన్మానించారు. రిటైర్డ్ టీచర్ రాజయ్య, ఉపాధ్యాయుడు అశోక్, కిషన్, వీరకుమార్, దావీద్, సుధాకర్, కమల, విమల, స్వామి, స్టాలీన్ ఉన్నారు.

బీజేపీలోకి హౌసింగ్ రిటైర్డ్ డీఈ



వేలేరు : మండల కేంద్రానికి చెందిన హౌసింగ్‌రిటైర్డ్ డీఈ సీతాదుర్గాప్రసాద్, శ్యామల దంపతులు ఆదివారం మాజీ మంత్రి గుండె విజయ రామారావు, బీజేపీ జనగామ అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు రాజు, జిల్లా నాయకులు కీర్తిసురేశ్, సుభాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

9న జాతీయ బృంద గీతాల పోటీలు

విద్యారణ్యపురి: భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో ఈనెల 9న వరంగల్ దేశాయిపేట రోడ్డులోని నాగార్జున ప్రైమ్ స్కూల్‌లో పాఠశాలల జాతీయ బృంద గీతాల పోటీలు నిర్వహించనున్నట్లు బీవీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఒక గ్రూపు హిందీ, సంస్కృతం పాటలు, రెండో గ్రూప్ ప్రాంతీయ భాషా గీతాలు, జానపద గీతాలు పాడవచ్చని పేర్కొన్నారు. ఒకే గ్రూపు రెండు విభాగాల్లోనూ పాల్గొనే అవకాశం ఉందని, ఒక్కో గ్రూపులో 8మంది విద్యార్థులు ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 12న హైదరాబాద్‌లో జరగబోయే బీవీపీ రాష్ట్ర స్థాయి జాతీయ బృంద గీతాల పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు వారు వివరించారు.

ప్రజలకు బాకీ చెల్లించి ఓటు అడగాలి


శాయంపేట : బాకీకార్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి


ధర్మసాగర్ : మాట్లాడుతున్న రాజయ్య

మాజీ ఎమ్మెల్యేలు గండ్ర, తాటికొండ

శాయంపేట : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు బాకీ ఉందని, వెంటనే చెల్లించి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ 22 నెలల పాలనలో ప్రజలకు ఉన్న బాకీ కార్డులను అందిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో ఎన్నో హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిందని గుర్తుచేశారు. కానీ ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. రైతుబంధు, మహిళలకు రూ.2500, వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు పెంచలేదని, కల్యాణలక్ష్మీ రూ.లక్షలతో పాటు తులం బంగారం ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22 నెలల్లో చేసిన అప్పుల లెక్కలే ఎక్కువని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటేయ్యండి అంటూ వచ్చే కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇదిగో మా బాకీ కార్డు మాకు రావాల్సిన బాకీ ఇవ్వండి అంటూ అడగాలని ప్రజలకు సూచించారు.

ధర్మసాగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. నారాయణగిరి, ముప్పారం, సాయిపేట ఎల్కుర్తి, నర్సింగరావుపల్లి, పెద్దపెండ్యాల, కరుణాపురం, ధర్మపురం, మల్లకపల్లి, ధర్మసాగర్ గ్రామాల్లో ఆదివారం ఊరూరికి బీఆర్ఎస్ సంక్షేమాలు, ఇంటింటికి కేసీఆర్ పథకాలు కార్యక్రమం నిర్వహించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు కడియం శ్రీహరికి చెంపపెట్టు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు అందరూ కృషిచేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ సోమిరెడ్డి, నాయకులు ప్రభుదాస్, కరుణాకర్, రవీందర్, రాజు, ప్రతాప్, లాల్ మహ్మద్, రమేశ్, బాలరాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి భిక్షపతి


మాట్లాడుతున్న భిక్షపతి

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి పిలుపునిచ్చారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు వివరించాలని సూచించారు. మండల నాయకులు సదిరం పోచయ్య, సొప్పరి రాజేశ్, పంచగిరి రాజు, జక్కుల కుమార్ యాదవ్, మహేందర్, బొంకూరి రవియాదవ్, గోల్కొండ రాజయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' పాలనలో ప్రజలకు ఇబ్బందులు


మాట్లాడుతున్న లింగయ్య

ఐనవోలు : ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాదాసి ప్రభాకర్ అధ్యక్షతన సీపీఎం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినప్పటి నుంచి గ్రామాలు ప్రత్యేక అధికారుల పాలనలోకి వచ్చాయన్నారు. అప్పటి నుంచి గ్రామాలను పట్టించుకోవడం లేదని, కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. మండల కేంద్రంలో రోడ్డు, డ్రెయినేజీ సమస్యలను అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిధులు లేవంటూ దాటవేత సమాధానం చెబుతున్నారని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యదర్శి నాగరాజు, సుధాకర్, రాజు, రాజిరెడ్డి, రజిత, హసీనా, మానస తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల గుడుంబా పట్టివేత


పట్టుకున్న గుడుంబాను చూపిస్తున్న పోలీస్‌లు

శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెంలో 20 లీటర్ల గుడుంబాను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గంగిరేణిగూడెం గ్రామంలో ఆదివారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన బానోతు శోభన్ తన ఇంటి వద్ద గుడుంబా విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి 20లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని శోభన్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కులేదు


మాట్లాడుతున్న జాకిర్‌అలీ

దామెర : స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే నైతిక హక్కులేదని మాజీ వైస్ ఎంపీపీ ఎండీ. జాకిర్‌అలీ అన్నారు. మండలంలోని ఊరుగొండలో ఆదివారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పనికిరాని మాటలు చెబుతూ కాలం వెళ్లదిస్తోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. ప్రజలు కూడా కాంగ్రెస్ పార్టీ పాలనపై అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, శంకర్, రాము, సునీల్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, మల్లయ్య, కృష్ణమూర్తి, సుదర్శన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.